క్లుప్తంగా

కె.జె.పురంలో పారిశుధ్య పనులు



మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో మురుగు కాలువల్లో పూడిక తొలగించే పనులు బుధవారం చేపట్టారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు కనెక్షన్లు ఇచ్చేందుకు గోతులు తీశారు. డ్రైనేజీల్లో రాళ్లు ఇరుక్కోవడం వల్ల మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలువల్లో పూడిక తీయించిన తర్వాత గ్రామంలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయిస్తామని సర్పంచ్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు

మాడుగుల: అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని ఫైర్ అధికారి రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం ఒమ్మలి హైస్కూల్‌లో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. నీటి, గ్యాస్, విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థి దశ నుంచే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీహెచ్‌వో పుష్పమ్మ

మాడుగుల రూరల్: పాఠశాలల్లో విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్. పుష్పమ్మ తెలిపారు. బుధవారం మాడుగుల శివారు గడబూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. భోజనం ముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలని, వేడినీటిని తాగాలని, సకాలంలో భోజనం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



బుట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో చెత్త బుట్టలను సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేయడం కోసం ప్రజలకు మూడు వేల బుట్టలు అందజేశామన్నారు. వేరు చేసిన తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారీ చేస్తారన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



ఎ.కోడూరులో టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకుడు సాయికుమార్

కె.కోటపాడు: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ఉచితంగా టీకాలను వేయించాలని పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ రైతులకు సూచించారు. బుధవారం ఎ.కోడూరు, పాడుగుపాలెం గ్రామాల్లో 220 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల నోటి, కాలిగిట్టల భాగంలో పుండ్లు ఏర్పడతాయన్నారు.

సరి‘కొత్త పల్లె’!



- జి.కొత్తపల్లి పంచాయతీలో 13.17 ఎకరాల్లో జగనన్న కాలనీ లేఅవుట్
- 512 మందికి స్థలాల కేటాయింపు
- ఇళ్ల నిర్మాణాలతో గ్రామంగా రూపాంతరం
- అభాగ్యులకు సొంతింటి కల సాకారం
- లబ్ధిదారుల ఆనందం

పట్టణాలు, నగరాల్లో కొత్తగా కాలనీలు ఏర్పడటం పెద్ద విశేషమేమీ కాదు.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు కొత్తగా ఊర్లే అవతరిస్తుండటం వింతగానే.. కాదు కాదు గొప్పగానే చెప్పుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలు ఏకంగా ఊర్లుగానే రూపాంతరం చెందుతున్నాయి. సకల మౌలిక వసతులతో ఎంతోమంది అభాగ్యులకు గృహయోగం కల్పిస్తున్నాయి.

చీడికాడ: నిలువ నీడలేని ఎంతో మంది నిరుపేదలకు సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారు. ఆయన తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయంతో స్వగ్రామంలో ఇల్లు లేక, స్థలం కొనుక్కునే స్థోమత లేక ఇతరుల పంచల్లో తలదాచుకుంటున్న అభాగ్యులకు గృహయోగం కల్పించారు. దాంతో చీడికాడ మండలంలో 512 గడపలతో ఊరుకు ఊరే అవతరించింది.

మండలంలో 23 పంచాయతీలకుగాను 36 గ్రామాలున్నాయి. వీటిలో 20 పంచాయతీల్లో ఇళ్ల స్థలాల కేటాయింపునకు అవసరమైన భూములు లేకపోవడంతో లబ్ధిదారులకు జి.కొత్తపల్లి పంచాయతీలో

మండలం	చీడికాడ
జగనన్న కాలనీ ఏర్పాటు	జి.కొత్తపల్లి
లేఅవుట్ విస్తీర్ణం	13.17 ఎకరాలు
మొత్తం లబ్ధిదారులు	512 మంది
లబ్ధి పొందిన పంచాయతీలు	20

కేజీబీవీని ఆనుకుని 13.17 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాల కోసం నాలుగు బోర్లను తవ్వించి వాటరు ట్యాంకులను, విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు గ్రావెల్, ఉచితంగా ఇసుక, 90 బస్తాలు సిమెంట్, సగం ధరకే ఇనుము పంపిణీ చేయడంతోపాటు డ్వాక్రా సంఘాలకు తక్కువ వడ్డీకి అదనంగా రుణాలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఇంకుడు గుంత తీసుకోవడానికి ప్రత్యేకంగా రూ.6 వేలు అదనంగా ఇచ్చారు.

ఈ లేఅవుట్ అటు చీడికాడ – చోడవరం ప్రధాన రోడ్డును, ఇటు కేజీబీవీ జంక్షన్ నుంచి బైలపూడి రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేయడంతో ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం సగం పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలయ్యాయి. మిగిలినవి వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఇది గ్రామంగా రూపాంతరం చెందడంతో పలువురు చిరువ్యాపారులకు జీవనోపాధిగా మారింది. అంతేగాకుండా గుడి, బడి, పార్కు, ఇతర అవసరాల కోసం 2.50 ఎకరాల భూమిని కేటాయించారు.



కొత్తగా ఏర్పడిన కాలనీ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలలో సగభాగం



ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత



ఇళ్ల నిర్మాణాలకు ఏర్పాటు చేసిన వాటర్‌ట్యాంక్

సొంత గుడిసైనా వేసుకోలేననుకున్నా..



మా ఊరులో నాకు ఇంటి స్థలం లేదు. ముసలిదాన్ని కావడంతో ఎవరూ చేరదీయలేదు. నా మరిది బొడ్డు నాగరాజుది అదే పరిస్థితి. ఇద్దరికీ ఇల్లు కట్టుకునే స్థోమత లేక తెలిసిన వారి పంచన తలదాచుకునేవారం. జగన్ బాబు ముఖ్యమంత్రి అయ్యాక నా పేరుతో ఇంటి స్థలం కోసం కాగితం పెట్టాను. కొన్ని రోజులకు ఇంటి స్థలం వచ్చిందని మా వలంటీర్ చెప్పగా, తొలుత నమ్మలేదు. ఆ తర్వాత నన్ను తీసుకెళ్లి ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు కట్టుకోవాలని స్కీం ఇచ్చారు. మా ఇద్దరం కూలికెళ్లి దాచుకున్న డబ్బులతో ఇల్లు కట్టుకున్నాం. ఇటీవల గృహ ప్రవేశం చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను చిన్న గుడిసైనా వేసుకోలేకున్నా.. ఇప్పుడు నాకు సొంతిల్లే చేకూరింది.

– గండి అచ్చియమ్మ, ఎల్.బి.పట్నం, చీడికాడ మండలం

కాలనీలో టీ దుకాణంతో జీవనం



నా భర్త రమణ 12 ఏళ్ల క్రితం మరణించాడు. అప్పటి నుంచి నా కుమార్తెను నేను కూలీ పనులకు వెళ్లి సాకుతున్నాను. ఆ వచ్చిన డబ్బులు మా జీవనానికే సరిపోయేవి కావు. జగనన్న కాలనీలో మా బంధువులు ఇల్లు కట్టుకున్నారు. వారిని అడిగి వరండాలో ఆర్నెల్ల క్రితం మా పాప భవ్యశ్రీ పేరిట చిన్న టీ దుకాణం పెట్టాను. దీని ద్వారా వచ్చిన ఆదాయంతో మా పాపను బాగా చదివించుకుంటున్నాను. ఇక్కడ కాలనీ వల్ల నాలాంటి వారు చాలా మంది బతుకుతున్నారు.

– గ్రటేడ్డి సూరీదమ్మ, చీడికాడ గ్రామం

నేడు నాకు సొంతిల్లు



మాది ఉమ్మడి కుటుంబం, మా ముగ్గురు అన్నదమ్ములకు పెళ్లిళ్లు అయ్యాయి. మేమంతా మా తాతల కాలం నాటి ఇంట్లోనే ఉంటున్నాం. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉమ్మడి కుటుంబం కావడంతో రాత్రిళ్ల తలదాచుకోవడానికి ఇబ్బంది పడేవాళ్లం. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జి.కొత్తపల్లి లేఅవుట్‌లో స్థలం ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాను. సీఎం జగన్ దయవల్ల మాకు సొంతింటి కల నెరవేరింది.

– బాలిబోయిన గంగరాజు, తాపీమేస్త్రీ, వరహాపురం

పాత చెరువు కప్పడాన్ని నిలిపివేయాలి

- రెవెన్యూ, పంచాయతీ అధికారులకు రెల్లివీధి వాసుల వినతి



చోడవరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రెల్లివీధి వాసులు

చోడవరం: పాత చెరువును కొంత భాగం కప్పేస్తుండటంతో తమ కాలనీలో వాడుక నీరు అందులోకి వెళ్లడంలేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని పట్టణంలోని రెల్లివీధి వాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు, పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. తహసీల్దారు పి.వేణుగోపాలరావుకు పంచాయతీ కార్యదర్శి నారాయణరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు. రెల్లివీధి ముంపు ప్రాంతమని, చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన కాలువ ద్వారా దిగువ చెరువులోకి వెళ్లాలన్నారు. ఆ చెరువును సగభాగం కప్పేయడంతో కాలువ నీరు వెళ్లకుండా ఉండిపోయిందని, ఆందోళ న వ్యక్తం చేశారు. తక్షణంలో చెరువు కప్పడాన్ని నిలిపివేయాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, రెల్లి సంఘం ప్రతినిధులు వర ప్రసాద్, జె. సన్యాసమ్మ, ఎస్.నాగేష్ పాల్గొన్నారు.

నేడు నెహ్రూ తీర్థం



నెహ్రూ విగ్రహం

మాడుగుల రూరల్: దేశ మాజీ ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తీర్థం గురువారం కె.జె.పురంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మదర్ థెరిసా టాలెంట్ యూత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇక్కడ శాలిపేట వీధిలో నెహ్రూ విగ్రహం వద్ద ఉదయం బాలలతో దేశభక్తి గేయాల ఆలాపన, అనంతరం పలు క్రీడా పోటీలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొంది.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ఎం. అలమండలో సూరెడ్డి వారి కల్లాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు, సర్పంచ్ దాడి జగన్ బుధవారం శంకుస్థాపన చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలో రోడ్డు సదుపాయం లేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఇక్కడ రూ. 7.50 లక్షలతో సీసీరోడ్డు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. దీంతోపాటు గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను తారురోడ్లుగా నిర్మించారన్నారు. ప్రతీ వీధికి సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారని గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణాలు వేగవంతం



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మండల వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న నూతన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సముదాయ భవన నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించే బాధ్యత ఇంజనీరింగ్, పీఆర్ అధికారులుపై ఉందన్నారు. అసంపూర్తి భవనాల పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రూ.3 లక్షలతో మాధవనగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైపులైను పనులు చేస్తామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో 12 బోర్లు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపించాలన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక

రోలుగుంట: బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్. అప్పారావు, ఆంగ్ల టీచర్ తమ్మునాయుడు, సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితానికే మలుపు అని, దీనిని గుర్తెరిగి ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. విద్యాపరమైన సందేహాలుంటే నివృత్తి చేసేందుకు, పరీక్షలు బాగా రాసేందుకు తమ వంతు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హెచ్‌ఎం తెలిపారు. అనంతరం పది విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. దీనిలో భాగంగా పలు నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



బండిప్రభను ప్రతిష్ఠించిన భక్తులు

రోలుగుంట: బండి ప్రభ ప్రతిష్ఠతో నాలుగు రోజుల పాటు నిర్వహించే గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు బుధవారం రోలుగుంటలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు పగటి వేషాలను ప్రదర్శించారు. సాయంత్రం వెదురు కలపతో సిద్ధం చేసిన 90 అడుగుల నిడివి గల బండి ప్రభను పోలిరెడ్డి నర్సింహమూర్తి ఇంటి వద్ద నుంచి మున్సిబ్ వర్గీయులు భుజాల మీద తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అదే సమయంలో ఇక్కడ భజనలు, కోలాటాల ప్రదర్శనలతో ఉత్సవాల సందడి సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ఇలవేల్పు ఉత్సవాన్ని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కె.కోటపాడు: ఉపాధ్యాయులకు మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి సాయికిరణ్



నాతవరం: పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో రాంబాబు



మాడుగుల రూరల్: మాత్రలు పంపిణీ చేస్తున్న ఈవోపీఆర్డీ మీనాకుమారి, వైద్యాధికారులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి, తదితరులు

నాతవరం: నులిపురుగుల నివారణతో విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీ వార్మింగ్ డే పోస్టరును ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జె.రాంబాబు మాట్లాడుతూ నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల పరిధిలో 8,955 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంఈవో తాడి అమృత్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, నాతవరం పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఎంపీహెచ్‌వోలు నాగేశ్వరరావు, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 8,150 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ మీనాకుమారితో కలిసి ఏఎన్‌ఎంలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వీటిని పంపిణీ చేశారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు వారికి అరమాత్ర, ఆపై దాటిన వారికి ఒక మాత్ర వేయాలన్నారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో 4,209 మందికి మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యాధికారి కె.ఎం.నాయుడు తెలిపారు. సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు: లంకవానిపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 9న రెండు నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి డి.సాయికిరణ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాత్రలను ఉపాధ్యాయులకు అందజేశారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులకు వేయాలని సూచించారు. మొత్తం 2,520 మందికి మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు, ఎంఈవో ప్రసాద్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు సూర్రెడ్డి శ్రీను, బోకం ఎర్రునాయుడు, నాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి సీతారామలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంఈవో మూర్తి, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మిలతో కలసి డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు



వల్సంపేటలో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. వల్సంపేట పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 65 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 50,655 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారంతా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండలంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందు జాగ్రత్తలపై పోలీసులతో చర్చిస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. వీఆర్వో బాబ్జి, పోలింగ్ బూత్ అధికారులు పాల్గొన్నారు.


కొండపాలెంలో సారా విక్రేత అరెస్టు

బుచ్చెయ్యపేట: కొండపాలెంలో సారా విక్రయిస్తున్న మహిళలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు. సమాచారం మేరకు బుధవారం తమ సిబ్బందితో గ్రామానికి వెళ్లి గాలింపు చేపట్టామన్నారు. ముచ్చకర్ల రామయమ్మ సారా అమ్ముతుండగా పట్టుకుని ఆమె నుంచి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు.

అమలాపురంలో వైద్య పరీక్షలు

నర్సీపట్నం: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో అమలాపురంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం వైద్యాధికారి సుమ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవీ, సుఖవ్యాధులు, క్షయవ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ వ్యాధులకు అవసరమైన మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు



ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికిగాను ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ తెలిపారు. ఐదో తరగతికి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు ఈ నెల 23వ తేదీలోగా ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదో తరగతికి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌కు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు జిల్లా స్థాయి గుర్రప్పందాలు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో జిల్లా స్థాయి గుర్రం, ఎడ్లబళ్ల పరుగు పందెంలను ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం కోలాటాల మధ్యన స్వామి వారి సంబరం సాగుతోందన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నూతన రాగి వంగడంతో అధిక దిగుబడి

మాకవరపాలెం: నూతన రాగి వంగడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత తెలిపారు. బుధవారం తామరంలో వేగావతి రకం రాగి వంగడాన్ని రైతులతో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా నాట్లు వేయడం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.